విమాన దోపిడి

భీమవరపు పురుషోత్తం

(గత సంచిక తరువాయి)

8

అంతే! బిగ్గరగా అరిచి కోదండాన్ని హెచ్చరిస్తూ పిస్టల్ తీసాడు.

అప్పటికే నలుగురూ డేనియల్ వెనుదిరగడం చూశారు! సుందరరాజన్ చంకలో కర్ర వదిలేసి దాదాపుగా తమను సమీపించిన తెల్లజాతీయుడివైపు చురుగ్గా ఉరికి, గన్ అందుకొని తను క్రిందికి పడిపోతూ అతడ్ని కూడా చెట్లచాటుకి లాగేశాడు. అతడికి తెలుసు ఆ అవకాశం పోగొట్టుకుంటే లెదర్ బాగ్ సంపాదించడం, వాళ్ళను అంతం చేయడం అసంభవం అని!

డేనియల్ పేల్చిన పిస్టల్ గుళ్ళు పడిపోయినవాళ్ళకు రెండు మూడంగుళాల పైనుండి చెట్ల బెరడులోనికి దూసుకొనిపోయాయి. మిగతా ముగ్గురు తెల్లజాతీయులు చెట్ల వెనక్కి తప్పుకున్నారు.

అతికష్టంమీద మోకాళ్ళమీద లేచిన సుందరరాజన్ స్టెన్‌గన్ డేనియల్ వైపు గురిపెట్టి కాల్చాడు!!

అది తప్పించుకోడానికి ఏ అడ్డూలేని విశాలమైన ఇసుక మైదానం కావడంతో డేనియల్ రక్తపు మడుగులో క్రిందికి జారిపోయాడు అరుస్తూ. క్షణాల్లో అతడు నిర్జీవుడయ్యాడు.

క్షణాలమీద జరిగిపోతున్న కాల్పులను వెర్రిగా చూస్తూ పడవ చాటున అతుక్కుపోయాడు కోదండం. వెంటనే సుందరరాజన్ కోదండంవైపు పేల్చిన గుళ్ళు ఇసుకలోనికి, కొన్ని పడవలోనికి దిగబడ్డాయి.

డేనియల్ అంతమయ్యాడని గ్రహించిన కోదండం భయభ్రాంతుడయిపోయాడు. ఇసుకలో పడివున్న డేనియల్ మృతదేహం అస్పష్టంగా కనబడుతూంది అతడికి. కాల్పులు జరుపుతున్నది యెవరో స్పష్టంగా కనిపించకపోయినా అది సుందరరాజ నేనని లీలగా పసిగట్టగలిగాడు!

చాలాసేపు నిశ్శబ్దం తాండవించిందక్కడ!

తెల్లజాతీయులు చెట్ల వెనుకనుండి కదలడంలేదు. సుందరరాజన్, డేనియల్‌ని చంపగలగడంతో కొంత ఆనందంగా వున్నాడు. ఇప్పుడు తీరిగ్గా ఆలోచించసాగాడు మిగిలిన శత్రుశేషాన్ని కూడా పూర్తిచేయడానికి....!

పడవ వెనక దాగిన కోదండం ఎంతకీ వెలుపలికి వచ్చేలా కనిపించడంలేదు. అసహనంగా కదిలాడతడు. వెనక్కి చూశాడు. తెల్లజాతీయులు చెట్లకు అతుక్కుపోయి వున్నారు.

విసుగ్గా పైకి లేవబోయాడు అటువైపుకు నడవడానికి

అప్పటికే కాలయాతన భరించలేక పడవ వెనుకనుండి పైకి లేచిన కోదండం కాల్పులు జరపడంతో, అతడి తలపై చెట్టు బెరళ్ళు బుల్లెట్ల తాకిడికి తూట్లు తూట్లు పడిపోయాయి.

వెంటనే నేలకు వంగి వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు సుందరరాజన్. గన్ గురిచూసుకొని నిర్విరామంగా కాల్పులు జరిపాడు!!

తన తొందరపాటుకు చింతిస్తూ కోదండం చప్పున క్రిందికి వంగబోయాడు. కానీ అప్పటికే ఆలస్యం జరిగింది! కంఠంలోనూ తలలోనూ దూరిన బుల్లెట్లతో నోటి నుండి రక్తం కారుతూండగా నిశ్శబ్దంగా పడవ వెనక్కి జారిపోయాడతడు.

రిలీఫ్‌గా నిట్టూర్చి విజయగర్వంతో పైకిలేచాడు సుందరరాజన్. దూరంగా పడున్న తన కర్ర చేతిక్రింద అమర్చుకొని, ఇసుకలో నడుస్తూ పడవ దగ్గరికి వెళ్ళి చూశాడు.

నిర్జీవంగా పడివున్న కోదండం శరీరాన్ని చూసి తృప్తిగా తలపంకించాడు. తెల్లజాతీయుల సాయం పెద్దగా లేకపోయినా, అదృష్టం తనవైపు వుండబట్టే తన పని సానుకూలమయిందన్న నమ్మకం కుదిరిందతడికి.

అప్పుడు కదిలాడు అతడు లెదర్ బాగ్ కోసం! తెల్లజాతీయులు ధైర్యంగా ముందుకొచ్చారిప్పుడు. సుందరరాజన్ మాట్లాడకుండా అక్కడి ప్రదేశాన్నంతా వేగంగా వెదకసాగాడు.

ఒక తెల్లజాతీయుడు అడిగాడు. "మిస్టర్ రాజన్! ఏమిటి ఇంకా ఆలస్యం? ఇక్కడనుండి బయటపడ్డానికి దేవుడి దయవల్ల ఈ పడవ దొరికింది మనకు. ఇక మనం

ఈ దీవిని ఎంత త్వరగా వదిలిపెడితే అంత మంచిది!"

విసుగ్గా చూశాడు సుందరరాజన్. "మిస్టర్ నువ్వు అనవసరంగా కంగారుపెట్టకు నన్ను. వీళ్ళ దగ్గర నా బాగ్ వుండాలి. లెదర్ బాగ్! ముందది కావాలి నాకు!" చెప్పాడు.

తెల్లజాతీయులు అసహనంగా చూశారు సుందరరాజన్ వంక. "ఏముందా బాగ్‌లో? అంతముఖ్యమా!" అడిగారు.

తడుముకోకుండా చెప్పాడు సుందరరాజన్ "నా బట్టలు, సామాన్లు అవసరమైన కొన్ని కాగితాలు ఉన్నాయందులో!"

తప్పేదిలేక వాళ్ళు కూడా వెదుకులాటలో పడ్డారు. ఇంతలో ఒక తెల్లజాతీయుడు అర్చి చెప్పాడు "అరె!? అటు చూడండి!"

అప్రయత్నంగా అందరూ సముద్రంవైపు చూశారు?! దూరంగా పల్చటి నీలంరంగులో వున్న సముద్రపు అలల వెనుక. పొగ! మెల్లగా పైకివస్తూన్న పొగ, అందరి ముఖాల్లో ఆశ్చర్యం! మరో తెల్లజాతీయుడు "ఏదో షిప్పు వస్తూన్నట్టుంది ఇటువైపు!!" అంటూ చెప్పాడు.

9

తెల్లజాతీయులకు వెర్రి ఆనందంగా వుంది షిప్పు దీవి వైపే రావడం చూసి! సుందరరాజన్ స్థితిమాత్రం అగమ్యగోచరంగా వుంది.

అసలు తాను ఇంతవరకూ కష్టపడింది బాగ్ కోసమే అని అతడికి తెలుసు. అలాంటిది అన్నీ పూర్తయ్యాక

బాగ్ కనిపించకుండా పోవడం, సరిగ్గా అదే సమయంలో ఆ నిర్మానుష్య దీవిని దాటడానికి షిప్పు రూపంలో అవకాశం రాబోవడం అతడిని అగమ్యగోచరంలో పడవేసింది.

"అరె! ఈ శవాలు ఇక్కడే ఉంటే షిప్పులో వాళ్ళు మనల్ని దగ్గరికి కూడా రానీరు. వీటిని తొలగించాలి ఇక్కడనుండి వెంటనే!" ఒక తెల్లజాతీయుడు చెబుతున్నాడు కంగారుగా.

మిగతా ముగ్గురు కూడా కంగారుపడ్డారు శవాల్ని చూసి. కాసేపటికి వాళ్ళు వాటిని ఈడ్చుకొంటూ చెట్లలోనికి దూరంగా పోయారు. ఒకచోట లోతుగా క్రిందికి గొయ్యిలా వున్న ప్రదేశంలో పడవేశారు. ఇసుకలో రక్తాన్ని పైన ఇసుకజల్లి కప్పివేశారు!

సుందరరాజన్ మాత్రం అప్పుడప్పుడు షిప్పువైపు చూస్తూ బాగ్ కోసం వెదుకుతూనే వున్నాడు. ఇంతలో ఒక తెల్లజాతీయుడు అతడి చేతిలో స్టెన్‌గన్ తీసుకొన్నాడు. "ఏ ఒక్క ఆయుధం మనవద్ద ఉన్నా అది మనకే ప్రమాదం!" కోపంగా చూసిన సుందరరాజన్‌ను ఉద్దేశించి చెప్పాడతడు.

ఆయుధాలు కూడా తీసికెళ్ళి ఎక్కడో పడవేశారు. అనుమానించదగ్గ ఆధారాలేవీ లేకుండా చేశారక్కడ తెల్లజాతీయులు.

క్రమంగా షిప్పు దీవిని సమీపించింది—

చాలా పెద్దదగా వుంది షిప్పు. తెల్లజాతీయులు ఒడ్డునే ఇసుకలో నిలబడి చేతులు నిర్విరామంగా ఊపుతున్నారు షిప్పువైపు. షిప్పు ఇటువైపుకు రాదేమోనని వాళ్ళకు భయం వుంది.

సుందరరాజన్ నిరాశగా చెట్లలోనుండి బయటికి వచ్చాడు. అప్పటికి తీరానికి దూరంగా లంగరు వేయ బడింది షిప్పు. బాగా ఎత్తులో షిప్పుపైన ఇనుప ఊచల గోడను పట్టుకొని కొందరు మనుషులు సరిగా బట్టలేని తెల్లజాతీయుల వంక, దీవిలోనికి ఆసక్తిగా, చిత్రంగా చూస్తున్నారు.

షిప్పునుండి ఆరు మోటారుబోట్లు నీటిపైకి దిగాయి. మొదటి బోటులో ఆయుధాలు ధరించిన షిప్ సెక్యూరిటి ఫోర్స్, మిగతా వాటిల్లో రంగురంగుల బట్టలలో ప్రయాణీకులు ఒడ్డుకు చేరుకొన్నారు!

సగానికి పైనే ఇసుకలోనికి వచ్చి ఆగిన బోట్లనుండి దిగారందరూ.... సెక్యూరిటి ఫోర్స్ వాళ్ళు తెల్లజాతీయులను సమీపిస్తూ ప్రశ్నించారు.

"ఎవరు మీరు!?"

ప్రయాణీకులు ఆసక్తిగా వాళ్ళను చుట్టుముట్టారు.

ఒక తెల్లజాతీయుడు చెప్పాడు ధైర్యంగా జరిగింది జరిగినట్టు, డేనియల్, కోదండాల ఉదంతం మినహా.

"చాలా ఏళ్ళుగా యిక్కడే పడివుంటున్న దురదృష్ట వంతులం.... దయచేసి మమ్మల్ని కూడా వెళ్ళేటప్పుడు మీతో తీసుకెళ్ళండి ప్లీజ్!" అంటూ అభ్యర్థించారు.

ప్రయాణీకుల్లో నుండి నల్లటి పరిశుభ్రమైన సూట్ వేసుకొన్న యింగ్లీషాయన ఫోర్స్ వాళ్ళతో చెప్పాడు.

"వాళ్ళ పరిస్థితి అర్థమవుతోందిగా. పైగా థాయ్ లాండ్‌లో వ్యతిరేక శక్తుల సమస్య సమసిపోయి దాదాపు ఐదారేళ్ళు అవుతూంది. అందువల్ల వీళ్ళను మనతోపాటు తీసికెళ్ళడం ధర్మం!" తెల్లజాతీయులు కృతజ్ఞతగా చూశారు ఆయన వంక.

ఫోర్స్ వాళ్ళకు యిక అప్పటికే వాళ్ళలో అనుమానించవలసిదేం కన్పించలేదు. ఫార్మాలిటీగా ఒకసారి ఐదుగుర్ని చెక్ చేశారు. తర్వాత విషయమంతా కెప్టెన్‌కి తెలియపర్చి, వాళ్ళను తమతో తీసికెళుతున్నామని తెలిపారు. దానితో తెల్లజాతీయుల ఆనందానికి అవధి లేకుండా పోయింది.

తర్వాత ప్రయాణీకులు ఫోర్స్ సహాయంతో దీవి చూడడానికి, ఒకరినొకరు హెచ్చరించుకుంటూ కదిలారు....!

తెల్లజాతీయులు అదిరిపడ్డారు, తాము శవాలు దాచిన చెట్లవైపే వాళ్ళు వెళ్ళడం గమనించి!

ఒక తెల్లజాతీయుడు తత్తరపాటుగా చెప్పాడు. "అటువైపు నేలంతా లోతుబురద. గోతుల్లోనికి జారిపోయే ప్రమాదం వుంది! పైపెచ్చు అటువైపు బురదకు మొలచిన పొదల్లో పాములు కూడా చేరాయి....ఇటువైపు అయితే వృక్ష సౌందర్యం చూడడానికి మీకు సౌకర్యంగా ఉంటుంది."

సాధ్యమైనంతవరకూ ప్రయాణీకుల్ని భయపెట్టి దారి మళ్ళించడానికి అతడి ప్రయత్నం ఫలించింది. అతడి మాటలకు భయపడి ఆగిపోయిన ప్రయాణీకులు తమ దారి ఇటువైపుకు మరల్చుకొన్నారు! మిగతా తెల్లజాతీయులు అతడిని అభినందనపూర్వకంగా చూశారు. సుందర రాజన్ కూడా ప్రయాణీకులు దారి మార్చుకోవడంతో రిలీఫ్‌గా ఫీలయ్యాడు.

అంతకుముందే ఇద్దరు ముగ్గురు ప్రయాణీకులు దీవి లోపలికి వెళ్ళే ధైర్యంలేక ఒడ్డునే వుండిపోయారు.

తెల్లజాతీయులు వాళ్ళను అడిగారు తిరుగుప్రయాణం

యెప్పుడని?

అది క్రూరమృగాలు లేని దీవి కావడం వలన రాత్రికి దీవిలోనే ఉండి ఉదయమే తిరిగి ప్రయాణమవ్వాలని చెప్పారు వాళ్ళు.

దానికి తెల్లజాతీయులు కొద్దిగా నిరాశపడ్డారు. ఎప్పుడు బయటి ప్రపంచంలో పడదామా అని వేగిరం పడుతున్న వాళ్ళకు, తిరుగు ప్రయాణం మర్నాటి ఉదయానికి అని తెలిసేసరికి ఉస్సురనిపించింది.

అయితే అది విని సుందరరాజన్ కి ఉత్సాహం వచ్చింది. తన బాగ్ వెదుక్కోవడానికి తగిన సమయం వుంటుంది అనుకొన్నాడతడు!

10

క్రమేపీ సాయంత్రం కావచ్చింది. దీవిలో చాలా వరకూ తిరిగి ప్రకృతి సౌందర్యాలు చూసి ఉత్సాహం తీర్చుకున్న ప్రయాణీకులు తీరానికి చేరారు అలసిపోయి. అస్తమించే సూర్యుని ఎర్రని కాంతికి వింతగా మెరుస్తూంది సముద్రపు నీరు. దీవి చుట్టూ వున్న అనంతమైన నీటిపై దీవికి చెందిన యెన్నో పక్షులు ఇంకా యెగురుతూండడం సర్వం మరచిపోయి తిలకించసాగారు ప్రయాణీకులు....

మనీలా నుండి సింగపూర్ బయలుదేరిన ప్రయాణీకులు వాళ్ళు! షిప్పులో వాళ్ళు ఆ దీవి గురించి వినడం, పైగా వాళ్ళెక్కిన షిప్పు దీవి సమీపం నుండే వెళ్ళవలసి రావడంతో, ప్రయాణీకుల కోరికపై షిప్పు కెప్టెన్, సెక్యూరిటీ ఫోర్స్ సహాయంతో వారికా సౌకర్యం కల్పించాడు. దీవి కూడా క్రూరమృగాలు లేనిదని తెలియడంతో వాళ్ళ కోర్కె సులభంగా నెరవేరింది.

సుందరరాజన్ సమయాన్ని వృథా చేయడంలేదు. బాగ్ కోసం గోప్యంగా వెతుకుతూనే ఉన్నాడు. కానీ దాని ఆచూకీ మాత్రం తెలియటంలేదు. అతడు బాగ్ కోసమే వెదుకుతున్నాడని తెలిసినా పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించలేదు తెల్లజాతీయులు! వాళ్ళు ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురుచూస్తున్నారు.

చీకట్లు అలుముకోసాగాయి దీవిచుట్టూ. మధ్యాహ్నం ఎర్రగా కాలిన ఎండ సాయంత్రమయ్యేకొలదీ క్రమంగా చల్లబడుతూ వచ్చింది. చీకటి పడ్డాక పూర్తిగా చల్లగా మారిపోయింది. వినీలాకాశంలో నక్షత్రాలు ప్రత్యక్షమౌతున్నాయి ఒక్కొక్కటిగా.

డిన్నర్ ఏర్పాట్లు చేయబడ్డాయి తీరంలోనే. దాని కోసమే ఎదురుచూస్తున్నారు తెల్లజాతీయులు. వడ్డించిన పదార్థాలే గాకుండా అడిగి మరీ వేయించుకొని తిన్నారు వాళ్ళు. డిన్నర్ పూర్తయ్యాక లైట్ మ్యూజిక్‌తోనూ, పాటలతోనూ చాలాసేపు కాలక్షేపం చేశారు ప్రయాణీకులు. అదొక అద్భుతమైన అనుభవంలా ఉంది వాళ్ళకు.

షిప్‌లో నుండి పడుకోవడానికి కావలసిన సామాగ్రి కూడా తీరంలోకి దించబడింది.... కొందరు చిన్న చిన్న గుడారాలు వేసుకొన్నారు. మరికొందరు ఇసుకలోనే బ్లాంకెట్లు పర్చుకొన్నారు. కొంతమంది దూరంగా పోయి, మంటలు వేసుకొని చుట్టూ మూగి కబుర్లు చెప్పుకోసాగారు.

తెల్లజాతీయులకు, సుందరరాజన్‌కు మత్తులు ఇచ్చారు. డాక్టరు సుందరరాజన్ గాయంపై కట్టువిప్పి ఆయింట్‌మెంటు పూసి దూదివేసి కట్టుకట్టాడు. రెండు ఇంజక్షన్లు కూడా చేశాడు. తెల్లజాతీయులు గోళ్ళు కట్ చేసుకొని

సముద్రంలో చాలాసేపు స్నానాలుచేసి బట్టలు వేసుకొన్నారు. చాలా కాలానికి మంచిబట్టలు వేసుకోగలిగినందుకు మురిసిపోతున్నారు వాళ్ళు.

హాయిగా నవ్వుతూ తుళ్ళుతున్న ప్రయాణీకుల్ని చూస్తే యిన్ని సంవత్సరాలు తాము పోగొట్టుకున్న స్వేచ్ఛ గుర్తు వచ్చి కొద్దిసేపు బాధపడ్డాడు.

మెల్లగా ఒక్కొక్కడు నిద్రలోకి జారసాగారు. సందడి సద్దుమణిగే కొద్దీ సముద్రపు అలల హోరు స్పష్టంగా వినిపించసాగింది. తెల్లజాతీయులు, సుందరరాజన్ పడవప్రక్కనే పడుకున్నారు. సన్నగా వీస్తున్న చలిగాలికి బ్లాంకట్లు కప్పుకుని వెచ్చగా పడుకున్నారు.

తెల్లజాతీయులు గురక శబ్దం చేస్తూ హాయిగా నిద్రిస్తున్నారు. సుందరరాజన్‌కి మాత్రం కళ్ళు మూతపడడం లేదు. బాగ్ ఏమయింది అన్నది అతడికి పెద్ద ప్రశ్న అయి కూర్చుంది?! అప్పటికే ఉన్న సమయాన్ని పూర్తిగా వినియోగించుకుని శక్తివంచన లేకుండా వెదికాడతడు! వెదికి వెదికి విసుగుపుట్టింది అతడికి.

ఎప్పుడో తెల్లవారుజామున పట్టింది నిద్ర! మాటల శబ్దాలకు కళ్ళు తెరిచాడు సుందరరాజన్. తెల్లవారిపోయింది పూర్తిగా! అప్పటికే దాదాపు అందరూ లేచి సామానులు సర్దేశారు. సామాన్లతో బాటూ ప్రయాణీకులూ మెల్లమెల్లగా షిప్పులోనికి చేరుకుంటున్నారు మోటారుబోట్లలో ...

ఎండమీద పడ్డంతో లేవక తప్పలేదు అతడికి. బద్ధకంగా వళ్ళు విరుచుకున్నాడు. తెల్లజాతీయులు ఇంకా షిప్పులోనికి వెళ్ళలేదు. తొందరపడుతున్నారు వెళ్ళడానికి. అతడిని కూడా తొందరపెట్టసాగారు.

"ఏమిటి సీత రావాలని లేదా!" తెల్లజాతీయు డొకడు అడిగాడు అతడి నిరాసక్తత గమనించి.

ఇబ్బందిగా నవ్వి "అలాంటిదేంలేదే! నాకూ రావాలని యిందుకు లేదు!?" అన్నాడు సుందరరాజన్.

ఇక మాట్లాడలేదు అతడు. వాళ్ళంతా బయల్దేరే ఉత్సాహంలో పడిపోయారు. సామాన్లు పూర్తిగా షిప్పులోనికి చేరాయి. ప్రయాణీకులతోబాటు ఒక బోట్ లో తెల్లజాతీయులూ ఎక్కి కూర్చున్నారు. బోట్ ధ్వని చేస్తూ షిప్పువైపు సాగిపోవడం సుందరరాజన్ చూశాడు.

ఇక ఆఖరిబోట్ ఆగింది. చివరిగా మిగిలిన వాళ్ళు ఎక్కి కూర్చున్నారు. బోటు నడిపే ఫోర్స్ గార్డ్ అయోమయంగా చూశాడు ఇంకా ఒడ్డునే నిలబడ్డ సుందర రాజన్ వంక! నిట్టూర్చి కదలలేనట్టు అడుగులు వేస్తూ మెల్లగా బోటులో ఎక్కి కూర్చున్నాడతడు.

బోట్ కదిలింది. సుందరరాజన్ తప్ప చివరిగా అందరూ ఆ అజ్ఞాతదీవికి వీడ్కోలు చెప్పారు....

సూర్యుడు మరో బెత్తెడు పైకి వచ్చేసరికి షిప్పు తిరిగి తన గమ్యంవైపు కదిలింది—

11

కాలకృత్యాలు తీర్చుకొన్న ప్రయాణీకులు కొందరు షిప్ డెక్ మీదికి చేరసాగారు.

అప్పటికి షిప్పు బయలుదేరి గంటపైనే గడిచింది! పైకి వున్న విశాలమైన భవనం నీడ డెక్ పొడవునా పడడంతో మరో రెండు గంటలవరకూ ప్రయాణీకుల కక్కడ సముద్రపు నీరు అలలు చూడడానికి అవకాశం వుంటుంది.

వృద్ధులు కుర్చీలు, టేబుళ్ళు వేయించుకొని కూర్చున్నారు. కొందరు మెట్లదగ్గర కూర్చున్నారు. మిగిలినవారు డెక్ అంచుమీద ఇనుప గొట్టాలమీద చేతులు వేసి మాట్లాడుకోసాగారు మెల్లగా. దాదాపు అందరి చేతుల్లోనూ బీరు నింపబడిన లావాటి గాజుగ్లాసులున్నాయి.

చేతిలో స్టిక్‌తో అనుకొని డెక్ గోడదగ్గర విచారంగా నిలబడి బీరు సిప్ చేస్తున్నాడు సుందరరాజన్ ఒంటరిగా.

తర్వాత అతడి ప్రక్కకు చేతుల్లో గ్లాసులతో ముగ్గురు వ్యక్తులు చేరారు. వారిలో ఇద్దరు, దీవిలో అతడు ఖైదు నుండి విడిపించిన తెల్లజాతీయులు. మిగిలిన వ్యక్తి పాత ప్రయాణీకుడే!

"ప్రస్తుతం తెల్లజాతీయుల వేషధారణ, ఆకృతి పూర్తిగా మారిపోయింది. మంచి దుస్తుల్లో హుందాగా వున్నారు. శుభ్రంగా షేవింగ్, కటింగ్ చేయించుకొని నిగనిగలాడే నల్లటి బూట్లలో కళ్ళల్లో కాంతులతో మెరిసిపోతున్నారు.

తమ ఆనందాన్ని సుందరరాజన్‌తో కూడా పంచుకోవాలని వుంది వాళ్ళకు!

"మిస్టర్ రాజన్! ఏమిటి ఈ శుభసమయంలో అదోలా వున్నారు? కమాన్ ఎంజాయ్ విత్ మి" ఉత్సాహపర్చడానికి ప్రయత్నించారు.

సుందరరాజన్ వాళ్ళను విష్ చేసి ఊరుకున్నాడు. ఒక తెల్లజాతీయుడు గ్లాసులో ద్రవం సిప్ చేస్తూ అడిగాడు "ఎనీ ప్రోబ్లమ్?"

"నో....నో ప్రాబ్లం!" సన్నగా గొణిగాడు సుందరరాజన్ ఏం చెప్పాలో తెలీక.

గాలి మెల్లగా వాళ్ళను తాకి వెళ్ళిపోతోంది. మిగతా ప్రయాణీకుల నవ్వులు ఆగి ఆగి వినిపిస్తున్నాయి.... "ఒక వేళ! యేదో బాగ్ కోసం వెతికారుగా చాలాసేపు, దానికోసమా?" అడిగాడు తెల్లజాతీయుడు రెండుక్షణా లాగి గుర్తు వచ్చినట్టు.

తన బాధంతా దానికోసమే కావడంతో సుందర రాజన్ నిట్టూర్చి మౌనంగా వుండిపోయాడు.

అప్పటివరకూ వాళ్ళ సంభాషణకు శ్రోతగా మాత్రమే వున్న, తెల్లటిబట్టలు ధరించిన నాలుగో వ్యక్తి గొంతు విప్పాడు. "బాగ్గా!" అని కొద్దిసేపు ఆగి "అక్కడున్న ఒక కర్రపడవ క్రింద చూశాను నేను దాన్ని! పడవ అడుగున ఇసుకలో కూరుకుపోయి వుంది. లెదర్ బాగ్!" చెప్పాడు.

త్రుళ్ళిపడ్డాడు సుందరరాజన్!! కళ్ళు గిర్రున ఆ మాటలు చెప్పిన వ్యక్తివైపు తిప్పాడు అప్రయత్నంగా అతని చెయ్యి వణికి గ్లాసులోని ద్రవం కొద్దిగా నేల మీదికి తొణికింది.

"మేక్స్ మిస్టర్ మేక్స్ ...!" అప్పటికే ఆ వ్యక్తిని యెవరో తొందరగా పిలవడంతో "ఎక్స్ క్యూజ్ మీ" అంటూ నిష్క్రమించాడతడు అక్కడినుండి.

ఆ వ్యక్తిని యేదో అడగాలని నోరు తెరిచిన సుందర రాజన్ అతడు అక్కడనుండి కదలడంతో మిన్నకుండి పోయాడు! సుందరరాజన్ పూర్తి అన్యమనస్కంగా వున్నాడని గ్రహించి, అతడిని కాసేపు ఒంటరిగా వదిలే ఉద్దేశ్యంతో అక్కడి నుండి దూరంగా నడిచారు తెల్ల జాతీయులిద్దరూ.

తేరుకొన్న సుందరరాజన్ తన బుద్ధిహీనతని తనే

నిందించుకున్నాడు. పడవవద్ద చూడకుండా బాగ్ కోసం దీవంతా అన్వానిలా వెదికినందుకు. ఇంతలో అతడి కళ్ళు మెరిశాయి యేదో గుర్తొచ్చి.

అన్వాకదీవినుండి కేవలం యాభై మైళ్ళ దూరంలో వాళ్ళ 'హోచిమిన్' సిటీకి చెందిన షిప్ యార్డు తగులు తుందని షిప్పులో వాళ్ళు మాట్లాడుకుంటూంటే గంట క్రితమే విన్నాడతడు! అప్పుడది పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆ సమాచారం తనకు ఖచ్చితంగా వుపయోగ పడుతుందని తెలుస్తూందతనికి!

అతడి ఆలోచనలు పరిగెడుతున్నాయి. యాభై మైళ్ళు చీకటిపడేసరికి చేసుకోవచ్చు తేలిగ్గా. కొంచెం కష్టపడితే పడవను పూర్తిగా సిద్ధం చేసుకోవచ్చు. షిప్ యార్డు చేరుకొంటే చాలు. అక్కడ్నించి సిటీకి యేదోలా చేర వచ్చు!

పెదవులు కదుస్తున్నాయి....ఇదే ఆఖరి అవకాశం అను కొన్నాడు. అతని నిర్ణయం బలపడింది!

కాసేపాగి సగం తాగిన గాజుగ్లాసును వంగి క్రింద పెట్టాడు జాగ్రత్తగా. లావాటి ఇనుపగొట్టాన్ని పట్టుకుని క్రిందికి చూశాడు. సూర్యకాంతి పడిన సన్నటి అలలను కోస్తూ షిప్పు పోతూంది. బాగా యెత్తుగానే వుంది షిప్పు! కానీ డబ్బు ముందు అదంత పెద్ద లెక్కలోది కాదతడికి!

అటూ యిటూ చూశాడు. ఎవరి గొడవలో వాళ్ళు న్నారు. ఒంటరిగా ఉన్నవాళ్ళ చూపులు కూడా అతని వైపు లేవు. గట్టిగా ఊపిరి వదిలాడు—గుండెల్లో మిగిలిన ఆందోళ్యాన్ని శరీరం నుండి బయటికి పంపేయ డానికి.

అంతే! చటుక్కున కదిలి స్టిక్ సహాయంతో ఇనుప గొట్టాలమీదికు ఎక్కికూర్చున్నాడు. నిజం చెప్పాలంటే అతనికి పెద్దగా భయం వేయడంలేదు! అప్పటికే ఇద్దరు ముగ్గురు అతని చర్య గమనించి కేకలు వేయసాగారు. అందరి దృష్టి అటు తిరిగేలోపు అతడు తన హాండ్‌స్టిక్ వెనక్కి డెక్ మీదికి జార్చేసి తను ముందుకు ఉరికేశాడు!!

క్షణాల్లో అందరూ గోలగా కేకలు పెడుతూ డెక్ మీదికి చేరుకొన్నారు. క్షేమంగా నీటిలో పడిన సుందరరాజన్ పైకి తిరిగిచూడకుండా జనం కేకలు వింటూ వేగంగా ఈదసాగాడు నీళ్ళల్లో....

షిప్‌లో వాళ్ళందరికీ తెలిసిపోయిందా వార్త! దాదాపు అందరూ డెక్ మీదికి చేరి చాలా దూరంలో నలకలా కనిపిస్తూన్న సుందరరాజన్‌ను ఆశ్చర్యంగా తెల్లబోయి చూస్తూ, ఎవరికి తోచింది వాళ్ళు వ్యాఖ్యానించసాగారు.

ఇందాకటి ఇద్దరు తెల్లజాతీయులు, తెల్లబట్టలు ధరించిన వ్యక్తీ ఓ మూలకి చేరారు. "బహుశా ఆ లెదర్ బాగ్ కోసమే వచ్చుంటాడని నాకు గట్టి అనుమానం— మొదటినుండీ దాని కోసమేగా కలవరిస్తున్నాడు!" అన్నాడో తెల్లజాతీయుడు.

దానిని రెండో వ్యక్తి అంగీకరిస్తున్నట్టు తల వూపి "అవును! అదే అయివుంటుంది. సమయానికి మేక్సో కూడా ఆ బాగ్ యెక్కడ కనిపించిందో జాడ చెప్పడుగా. ఏదో విలువయినదే వుంటుందా బాగ్‌లో?!" అన్నాడు సాలోచనగా.

అది విని తెల్లబట్ట వేసుకొన్న మేక్సో నివ్వెరపోతూ

చెప్పాడు.

"అరె! ఆ బాగ్ కోసమా అతడు క్రిందికి దూకి వెళ్ళింది! అది ఇంకా అక్కడే ఉంటుంది.... దానిని చూసిన తర్వాత, తెల్లవారుజామునే దానిని ఫోర్స్ గార్డు ద్వారా మన కెప్టెన్‌కు అందజేయించానుగా! దాని యజమాని యెవరో తెలిసేవరకూ అది తనవద్దే భద్రపరుస్తానని కెప్టెన్ చెప్పాడు!"

* * *

సరిగ్గా యీ సంఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత—

దాదాపు ఇండియాలోని అన్ని దినపత్రికలలోనూ మొదటి పేజీలో ఒక బాక్స్ కట్టబడిన వార్త పడింది....

దొరికిన లెదర్ బాగ్!!

మనీలా, అక్టోబరు 14: మనీలా నుండి ఇండియాకు వచ్చే విమానంలో ఈ నెల పదవ తేదీన ఇండియాలోని విదేశీ బాంకులకు రావలసిన 35 లక్షల ఇండియన్ కరెన్సీ దోపిడీ జరిగిన ఉదంతం పాఠకులకు విదితమే!

చిత్రంగా ఆ మర్నాడు అంటే 11 వ తారీఖు సాయంత్రం ఒక అజ్ఞాతదీవిని దర్శించడానికి వెళ్ళిన ఓడ ప్రయాణీకుల్లో ఒక వ్యక్తి 35 లక్షలున్న లెదర్ బాగ్ అక్కడ చూడడం, దానిని షిప్ కెప్టెన్‌కు అప్పగించడం జరిగింది! వెంటనే కెప్టెన్ ఎఫ్. ఓ. పార్కర్స్ దానిని భద్రపరిచారు.

దానికొరకే సుందరరాజన్ అనే ఇండియాకు చెందిన పాత నేరస్థుడు నీటిలో దూకాడని తెలియడంతో, అనుమానంతో బాగ్ తెరిపించిన కెప్టెన్‌కు అసలు సంగతి బోధపడింది.

విమానంలో దోపిడీ చేసినవారిలో సుందరరాజన్ కూడా ఒకడనటానికి చాలావరకూ ఆధారాలు లభించాయి. 85 లక్షలున్న లెదర్ బాగ్ భారతప్రభుత్వానికి క్షేమంగా అందజేయబడింది. ఈ కేసుపై పరిశోధన ఇంకా జరుగుతూంది....

— అయిపోయింది —